క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాధ

విశాఖ విద్య: జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన బి.రాధ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, డీవీఈవోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలియజేశారు. వృత్తి విద్య కళాశాలల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచించారు.

నేడు ఏయూలో జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ దొరబాబు తెలిపారు. హెటిరో సంస్థ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో 25 ఖాళీల భర్తీకి ఫార్మసీ కోర్సులు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ చేసిన వారు అర్హులు. వీరికి రూ.2.7 లక్షల వార్షిక వేతనం అందిస్తారు. జూనియర్ కెమిస్ట్‌లో 50 ఖాళీలు భర్తీ చేయనున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు అర్హులు. జూనియర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఐటీఐ ఫిట్టర్, మెకానికల్ డిప్లమో చేసిన వారు అర్హులు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు ఫార్మసీ చదివిన వారు, ఫార్మసీ ఎయిడ్, సీఎస్‌ఏ, ఆడిట్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్ అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఇవ్వనున్నారు. వివరాలకు 96660 92491 నంబర్‌లో సంప్రదించాలని దొరబాబు కోరారు.

ఘనంగా గౌరీ ఉత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వర ఆలయం ఆధ్వర్యంలో 42వ గౌరీ పరమేశ్వరుల వార్షిక మహోత్సవం జరుగుతోంది. ఈ నెల 11న ప్రారంభమైన ఉత్సవాలు డిసెంబర్ 9 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా మండపంలో ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరుల విగ్రహానికి ప్రతి రోజూ పూజలు చేస్తున్నారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు.

యువతి అదృశ్యం



సత్యగాయత్రి

మద్దిపాలెం: కాలేజీకి వెళ్లాలని చెప్పి ఓ యువతి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో తల్లి కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సత్యానగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న సత్యగాయత్రి ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. రోజూ మాదిరి శుక్రవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో కాలేజీకని చెప్పి బయలుదేరి వెళ్లింది. రాత్రి అవుతున్న తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో తల్లి సత్యవేణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు యువతి తన కోసం చూడొద్దని తన తండ్రి ఫోన్‌కు మెసేజ్ పంపినట్టు పోలీసులు తెలిపారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలోని పుట్టలో పాలు పోసి పూజిస్తున్న భక్తులు

- పుట్టల్లో పాలు పోసి నాగేంద్రుడిని పూజించిన భక్తులు
- అంతటా సందడి వాతావరణం



సీతంపేట ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలోని పుట్టల్లో పాలు పోస్తున్న భక్తులు

సీతంపేట: నాగుల చవితి పర్వదిన వేడుకలు శుక్రవారం నియోజకవర్గంలో వాడవాడలా ఘనంగా జరిగాయి. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం, జాతీయ రహదారిపై గ్రీన్‌బెల్ట్ ఆవరణలోని పుట్టల వద్ద పూజలు చేసేందుకు వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. అక్కయ్యపాలెం, నరసింహనగర్, రామచంద్రానగర్, దొండపర్తి, జగన్నాథపురం, శ్రీనివాసనగర్, నందగిరినగర్ ప్రాంతాల నుంచి సంప్రదాయ దుస్తుల్లో కుటుంబ సమేతంగా పోర్టు స్టేడియానికి తరలివచ్చి పాముల పుట్టలను భక్తిశ్రద్ధలతో పూజించారు. పాలు పోసి, కోడిగుడ్లు, చిమిలి, పలు రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. పుట్టమన్ను చెవులకు ధరించి కాపాడాలని నాగేంద్రుడిని వేడుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చి సందడి చేశారు.

సంప్రదాయ దుస్తుల్లో భక్తుల కనువిందు

సీతంపేట, రామాటాకీస్, శ్రీనగర్, తులసిపేట, రేసపువానిపాలెం ప్రాంతాలవాసులు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి ఆవరణలో పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ఉదయం నుంచి సంప్రదాయ వస్త్రధారణల్లో భక్తులు కనువిందు చేసారు. సీతంపేట ప్రభుత్వ నేత్ర వైద్యశాల, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, రీజనల్ ట్రైనింగ్ సెంటర్ కేంద్రాల ఆవరణలు భక్తులతో కిటకిటలాడాయి.

లలితా పీఠంలో..

అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠం ఆవరణలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, నాగబంధానికి పెద్ద సంఖ్యలో భక్తులు క్షీరాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం లలితా అమ్మవారిని దర్శించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నాగదేవతలకు పూజలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో నాగదేవతలకు భక్తులు క్షీరాభిషేకం, పూజలు చేశారు. నాగుల చవితి సందర్భంగా ఉదయం నీలకంఠేశ్వరుడికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. నక్కవానిపాలెం, గాంధీనగర్, క్రాంతినగర్, 60 అడుగుల రోడ్డు, రేసపువానిపాలెం, ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీ తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్ద భక్తులు పాలు పోసి పూజలు జరిపారు.

కొండవాలు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో..

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47, 48, 54 వార్డుల్లోని కంచరపాలెం కొండవాలు ప్రాంతాలు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాల్లో వేకువజాము నుంచే ప్రజలు పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. కప్పరాడ, పెదకొత్తూరు, సంజీవయ్య కాలనీ, కైలాసపురం, శాంతినగర్, శ్రీనివాసనగర్, ఇందిరానగర్, తాటిచెట్లపాలెం, కప్పరాడ, బర్మాక్యాంప్, కస్తూరినగర్, 104 ఏరియా బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్ద బాణసంచా కాల్చి భక్తులు నాగుల చవితి పూజలు ఘనంగా నిర్వహించారు.



కంచరపాలెం కొండవాలులో నాగేంద్రుడిని పూజిస్తున్న భక్తులు



నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వరాలయంలో నాగదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పుట్టల వద్ద నాగుల చవితి పూజలు చేస్తున్న భక్తులు

● కె.కె.రాజుకు శారదా పీఠాధిపతి ఆశీస్సులు



విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయనను నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దర్శించుకున్నారు. స్వామీజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి.. ఆయన ఆశీస్సులు పొందారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కె.కె.రాజు, సారిపల్లి గోవింద్

మురళీనగర్: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పుట్టిన రోజు శుక్రవారం 49వ వార్డు పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, అడ్డాల బంగార్రాజు, కిరణ్‌రాజు, యూత్ ప్రెసిడెంట్ సన్నీ, ఉప్పిలి అప్పన్న పాల్గొన్నారు.

అలరించిన కథా రచయితల గోష్ఠి



ప్రసంగిస్తున్న కథా రచయిత బాబు

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించిన కథా రచయితల గోష్ఠి అలరించింది. రచయిత అడపా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు రచయితలు తమ కథా రచనలు, వారి అనుభవాలను వినిపించారు. ముందుగా నాగలక్ష్మి బృందం లలిత సంగీతంతో సభికులను ఆకట్టుకుంది. ముఖ్య అతిథి కథా రచయిత ఎన్.కె.బాబు కథ, సామాజిక ప్రయోజనం అంశంపై ప్రసంగించారు. డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ ఈతరంలో గ్రంథాలయాలకు ప్రాధాన్యం తగ్గడం బాధాకర విషయమన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణ చేసిన సేవలను గుర్తుచేశారు. ప్రశాంతి పోతిన మహిళా రచయిత్రుల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా కథా రచయిత కొనే వెంకట నాగ ఆంజనేయులను సన్మానించారు. కార్యక్రమంలో రచయితలు సి.నిర్మల, ఎం.సుబ్బారావు, రాధారాణి, మేడా మస్తాన్ రెడ్డి, డి.వి.సూర్యారావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పేదల సేవలో 'నీరజ' ట్రస్ట్



ట్రస్ట్ లోగో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కంచరపాలెం: పేదలకు సేవ చేసే భాగ్యం, చేయూతనిచ్చే లక్ష్యంతో నీరజ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ఫౌండర్ ఎస్.కె.రత్నం తెలిపారు. 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో శుక్రవారం ముఖ్య అతిథులు ట్రస్టీ కళింగ కోమట్ల రాష్ట్ర అధ్యక్షుడు లాడి కిషోర్‌కుమార్, శ్రీనివాస్, దాసు త్రినాథ్ ట్రస్ట్‌ను ప్రారంభించి, లోగో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనాథ పిల్లలకు ఉచిత విద్య, వృద్ధులకు ఆశ్రమం, వైద్యం, మందులు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ట్రస్ట్‌కు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ట్రస్టీ రత్నం మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు నాటడం, అన్న, వస్త్రదానాలు, చిన్న గ్రామాల అభివృద్ధికి చేయూత, మహిళలకు ఉపాధి అవకాశాల కోసం ఉచిత శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు కె.మహాలక్ష్మి, కిషోర్, కృష్ణ, రాజ్‌కుమార్, అనంతలక్ష్మి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంపా హనోకు, అరుల్‌దాస్ తదితరులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో డాన్‌బాస్కో నవజీవన్ వైజాగ్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణకు ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాన్‌బాస్కో నవజీవన్ వైజాగ్ డైరెక్టర్ అరుల్‌దాస్ మాట్లాడుతూ ప్రతి ఏడాది బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథి జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు బాలల హక్కులు, పరిరక్షణ, విద్య, ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నాయన్నారు. అదే సమయంలో ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజలను, వీధి బాలల తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాలని కోరారు. హెల్దీ మైండ్–హెల్దీ లైఫ్ (ఆరోగ్యకరమైన జీవితం కోసం ఆరోగ్యకరమైన మనసు) అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాన్‌బాస్కో నవజీవన్ కో ఆర్డినేటర్ రాంబాబు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఏఎస్సార్ నగర్ సెక్రటరీ ఎన్.సతీష్, డాన్‌బాస్కో స్కూల్ టీచర్స్ కల్యాణి, రమ, అధిక సంఖ్యలో బాలబాలికలు పాల్గొన్నారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలియజేశారు. ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా టపాసులు, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లు, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావొద్దన్నారు. ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశముందని ఆయన చెప్పారు. వీటి వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో వాల్తేర్ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేలుడు పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటివి గుర్తించిన వారు వెంటనే రైల్వే అధికారులకు, రైళ్లలో ఉండే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని డీఆర్‌ఎం సూచించారు.

విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం



గ్రంథాలయ సభ్యత్వం తీసుకున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పలువురు పాఠశాల విద్యార్థులు సభ్యత్వ రుసుమును లైబ్రేరియన్ వై.పద్మజకు అందించి సభ్యులుగా చేరారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనను విశ్రాంత ఉద్యోగి ఎంవీ భాస్కరరావు ప్రారంభించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. దేశభక్తి గేయాలపై పోటీలు నిర్వహించారు. సుమారు 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్షేమకాళిని దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్



క్షేమకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ ఆర్చ్ వద్ద జరుగుతున్న క్షేమకాళి పంచరాత్రి మహోత్సవాల్లో అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీశ్వరాలయంలో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న మురుగన్ సేవా సమితి ప్రతినిధులు

సీతంపేట: స్థానిక పార్వతీశ్వరాలయంలో మురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి వరకు 36 రోజులు మధ్యాహ్నం పూట అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ఇందులో 26 రోజులు నీలాపు తిరుమల బాలకృష్ణారెడ్డి, సునీతరెడ్డి దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం జరుగుతున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతి రోజూ పలువురు వచ్చి అన్నప్రసాదం స్వీకరిస్తున్నట్టు చెప్పారు.

జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. సుమారు 7 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 360 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 86 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 45 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిసెంబర్ 17న వైజాగ్ మారథాన్



టీషర్ట్, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్, నిర్వాహకులు

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో డిసెంబర్ 17న వైజాగ్ మారథాన్ జరగనుంది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ పరుగు నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నారు. 21 కిలోమీటర్ల పరుగుతో పాటు 10 కి.మీ., 5 కి.మీ., 3 కి.మీ. పరుగు పార్క్ హోటల్ దరి వైఎస్సార్ విగ్రహం చెంత ప్రారంభించి అక్వేరియం, రోప్ వే మీదుగా రాడిసన్ హోటల్ వద్ద టర్న్ తీసుకుని తిరిగి వీఎంఆర్డీఏ పార్క్ వద్దకు చేరుకోవడంతో ముగియనుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలన్నారు. వైజాగ్ మారథాన్ నిర్వాహకులు ఔత్సాహికులకు అందించే టీషర్ట్, మెడల్స్‌ను ప్రదర్శించారు. అల్పాహారాన్ని ఔత్సాహికులకు అందిస్తామని, దారి వెంట వైద్య సహాయకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైజాగ్‌మారథాన్.కామ్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ప్రారంభం



తొలి పూజ చేస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌరీ సేవా సంఘం భవనంలో లలితా మహిళా సంఘం ఆధ్వర్యంలో గౌరీ మాతకు తొలి పూజ చేసి మండపం వరకు ఊరేగింపుగా విగ్రహాలను తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. సూరిశెట్టి అప్పలకొండ, సూరిశెట్టి అచ్యుతరామ్, నాగరాజు, దొడ్డి దేవుళ్లు, శరకం రాజు, శరకం సూరిబాబు, సూరిశెట్టి రాజు, కాంద్రేగుల రవి, కంద్రపు బ్రహ్మాజీ, బుద్ధ వెంకట సత్యప్రసాద్, మహిళలు, బుల్లెట్ బాయ్స్ పాల్గొన్నారు.

ఉద్యోగుల స్పందనకు 46 వినతులు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట: కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు 46 వినతులు వచ్చాయి. జిల్లా, మండల కార్యాలయాల్లో విధుల నిర్వహించే వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులను అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, ఏవో ఈశ్వరరావు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నిర్ణీత కాలంలో వీటికి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.